సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 16 । జూలై । 2023



డబ్బులు చెల్లించకపోవటంతో..

59 జీఓ కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నా, డబ్బులు చెల్లించకపోవటంతో రెవెన్యూ అధికారులు ఇళ్ల కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు.

8లో



గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి ..

గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పలువురు లబ్ధిదారులకు వారు గొర్రెలను పంపిణీ చేశారు.

9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీకి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే శివశంకర్ రావు

హత్నూర (సంగారెడ్డి): ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్ల రాజేశ్వర్ రెడ్డిని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.

జిల్లాలో పోలీసు అధికారుల బదిలీలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లాలో పోలీసు అధికారులను బదిలీ చేస్తూ ఎస్పీ రమణకుమార్ శనివారం తెలిపారు. జిల్లాలో 8 మంది ఇన్‌స్పెక్టర్లు, 51 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ అయ్యారని పేర్కొన్నారు.

సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనూ..

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి రూరల్ సీఐ శివలింగం స్థానంలో ఐజీ కార్యాలయం వెయిటింగ్లో ఉన్న సుధీర్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కుర్షిద్ అలీ సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి డీసీఆర్బీకి బదిలీ అయ్యారు. కాగా ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సీసీఎస్ సంగారెడ్డికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఇంద్రకరణ్ ఎస్ఐ రాజేష్‌నాయక్ మేరావత్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

పటాన్‌చెరు డీఎస్పీగా..

పటాన్‌చెరు టౌన్ : పటాన్ చెరు నూతన డీఎస్పీగా పురుషోత్తం రెడ్డి నియమితులయ్యారు. కాగా ఈయన రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం ఏసీపీగా విధులు నిర్వహించారు. కాగా ఇక్కడ నుంచి డీఎస్పీ భీమ్‌రెడ్డిని చీఫ్ ఆఫీస్ హైదరాబాద్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

బీసీ కార్పొరేషన్ అధికారికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్: కల్లుగీత వృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇవ్వాలని శనివారం కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి జగదీశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ నిరుపేద గౌడ కల్లు గీత కార్మికులందరికీ ప్రభుత్వం రూ.లక్ష సాయం ఇవ్వాలన్నారు. బీసీ కార్పొరేషన్ అధికారికి 500 మంది కల్లుగీత కార్మికుల దరఖాస్తులు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్, జిల్లా నాయకుడు ప్రతాప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీటీడీ బహుమతులు



సర్టిఫికెట్లు అందజేసిన టీటీడీ సభ్యులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ మెదక్ జిల్లా సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కథ చెబుతాం.. ఊకొడతారా పిల్లలకు కథల పోటీలు శనివారం నిర్వహించారు. సంగారెడ్డి శ్రీకృష్ణ మందిరం లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి , ధర్మ ప్రచారం మండల సభ్యులు బందన్న గుండప్ప, శివప్రసాద్, పాండురంగం, దామోదర్ రెడ్డి, వకీల్ మల్లేశం, రామ్ రెడ్డి హాజరయ్యారు. పిల్లలు ఉత్సాహంగా కథల పోటీల్లో పాల్గొన్నారు. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు జూనియర్ల గ్రూపు, ఆరు నుంచి పదో తరగతి వరకు సీనియర్ల గ్రూపుగా విభజించి పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి నగదు బహుమతులు ఇచ్చారు.

బాబోయ్ కాలుష్యం..



బొంతపల్లి చెరువులో చేరిన కాలుష్య జలం



ఖాజీ చెరువులోకి పారుతున్న కాలుష్య జలం

- వ్యర్థాలను వదులుతున్న పరిశ్రమలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): అసలే వర్షాకాలం..అందులో కాలుష్య జలాలను వర్షపు నీటిలో వదులుతున్నారు. దీంతో చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. పొలాలు దెబ్బతింటున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా పీసీబీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం, గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, మంబాపూర్ తదితర గ్రామాలు పారిశ్రామిక ప్రాంతాలు. ఈ పారిశ్రామిక వాడల్లో సుమారు 250 భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో 80 శాతం రసాయన పరిశ్రమలు ఉన్నాయి. 20 ఏళ్లక్రితం ఈ ప్రాంతాల్లో భారీగా రసాయన పరిశ్రమలు వెలిశాయి. వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పర్యావరణ వేత్తలు ఈ సమస్యను పరిష్కరించాలని సుప్రీంకోర్టులో కేసు కూడా వేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

భూగర్భ జలాలు కలుషితం

సుమారు వెయ్యి అడుగుల వరకు ఉన్న బోరు నుంచి పసుపు రంగులో నీరు బయటకు వస్తుంది. అంటే ఇక్కడి భూగర్భ జలాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాలుష్య ప్రభావానికి పంట పొలాల్లోని బోర్లు చీకిపోయి పడిపోయాయి. బోర్ల వద్ద భూమిలోని ఇనుప పైపులు కాలుష్య జలాల ప్రభావానికి వంగి పోతున్నాయి. దీంతో రైతులు బోర్లు వేయటం కూడా విరమించుకున్నారు. భూగర్భంలో స్వచ్ఛమైన నీరు రావాలంటే మరో 20 ఏళ్లు పట్టొచ్చని పర్యావరణ వేత్తలు, అధికారులు చెబుతున్నారు.

ఘాటు వాసనలు

పారిశ్రామిక వాడల్లోని ప్రజలు నిత్యం కాలుష్య వాయువులను పీలుస్తున్నారు. నిబంధనలను సైతం లెక్క చేయకుండా పరిశ్రమల యజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేని కొత్త ఉత్పత్తులను తయారు చేస్తూ భారీగా వ్యర్థాలను వదులుతున్నాయి. అంతేకాక ఘాటు వాయువులను బహిరంగంగా రాత్రి సమయంలో విడుదలచేస్తున్నాయి. దీంతో శ్వాస పీల్చుకోవటం ఇక్కడి ప్రజలకు కష్టమవుతుంది.

ప్రాణాంతకమైన వ్యాధులతో ఇబ్బందులు..

వాయు, జల కాలుష్యం వల్ల పారిశ్రామిక వాడల ప్రజలు ప్రాణాంతక వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామికవాడల్లో నివసిస్తున్న మహిళలకు గర్భస్రావాలు అవుతున్నాయంటే ఇక్కడి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడుతున్నారు. వాటితో పాటు చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, నిమోనియా, ఆస్తమా, టీబీ లాంటి వ్యాధులతో బాధ పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. చిన్నారుల్లో పెరుగుదల కూడా లోపిస్తుంది. బుద్ధిమాంద్యం, జ్ఞాపక శక్తి వంటి సమస్యలతో అల్లాడుతున్నారు.

చెరువులు, కుంటల్లో కాలుష్య జలాలే..

మండలంలోని పారిశ్రామిక వాడల్లో గల కుంటలు, చెరువులు కాలుష్యం కారణంగా కలుషితమయ్యాయి. వర్షాల సాగుకుతో వర్షపునీటితో వ్యర్థ జలాలను భారీగా చెరువులు, కుంటల్లోకి వదులుతున్నారు. బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల్లోని సుమారు 30 కుంటలు, 10 చెరువులు పూర్తిగా కలుషితమయ్యాయి. ఖాజీ చెరువులోని కాలుష్యమట్టిని తొలగించి, ప్రక్షాళన చేయాలని 16 ఏళ్ల క్రితమే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయినా అధికారులు పట్టించుకోలేదు.

స్వచ్ఛమైన గాలి కూడా కరువే..

పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం వల్ల గాలి పూర్తిగా కలుషితమవుతోంది. గాలిలో విషవాయువులు పేరుకుపోతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా హైడ్రోజన్ సల్ఫైడ్, క్లోరిన్, మెరికాప్ట, అన్ని రకాల సల్ఫర్ కాంపొండులు గాలిలో కలుస్తున్నాయి. దీంతో ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారు. గాలిలో 21 శాతం ఆక్సిజన్ ఉండాల్సి ఉండగా, కాలుష్యం, ఇతర కారణాల వల్ల 19 శాతానికి తగ్గిందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలం వస్తే అంతే..

రసాయన పరిశ్రమల యాజమాన్యాలకు వర్షాకాలం వచ్చిందంటే పండగే. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా రసాయనాలను వర్షం నీటితో కలిపి బయటకు వదులుతుంటారు. దీంతో చెరువులు, కుంటలు పూర్తిగా కలుషితమవుతున్నాయి.

వర్షాకాలంలో వ్యర్థ జలాలను బయటకు రాకుండా చర్యలు తీసుకోవడంలో పీసీబీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమస్య చాలా వరకు తగ్గింది

ప్రస్తుతం కాలుష్య సమస్య పారిశ్రామిక వాడల్లో చాలా వరకు తగ్గింది. కలుషిత జలాలను, వాయు కాలుష్యాన్ని బయటకు వదులుతున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలంలో వ్యర్థ జలాలు బయటకు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశాం.

– కుమార్‌పాఠక్, పీసీబీ, ఈఈ

20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- డీఆర్ఓ నగేశ్



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి నగేశ్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ముందస్తు ప్రణాళికతో నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి నగేశ్ సూచించారు. శనివారం డీఆర్ఓ చాంబర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయసుగల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను వేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ఈ మాత్రలపై అవగాహనా కలిగించి, వారి పిల్లలకి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 20వ తేదీన మాత్రలు వేయించని పిల్లలకు ఈనెల 27న వేయించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శశాంక్ దేశ్ పాండే, మహిళా శిశు సంక్షేమ అధికారిని పద్మావతి, సంబంధిత శాఖల అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్‌గా రాధాబాయి



పుష్పగుచ్ఛం ఇస్తున్న రాధాబాయి

జహీరాబాద్: జహీరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్)కు డిప్యూటీ కలెక్టర్‌గా రాధాబాయి నియమితులయ్యారు. శనివారం ఆమె ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాదాపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో కలిశారు. నిమ్ విషయాలపై ఇరువురు చర్చించుకున్నారు.

హరిత జిల్లాకు సహకరించాలి

- పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి
- కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాను హరిత జిల్లాగా రూపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ శరత్ పిలుపు నిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో 2023–24 సంవత్సరం హరితహారం లక్ష్యాల పురోగతిపై వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్‌హెచ్ఏఐ, తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను హరిత జిల్లాగా చేయాలని, అందుకు ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలు, నాటిన మొక్కల వివరాలను ఆరా తీశారు.టార్గెట్ మేరకు మొక్కలు నాటాలన్నారు. విద్యాశాఖకు అదనంగా లక్ష్యాన్ని కేటాయించాలని డీఆర్డీఓను ఆదేశించారు. ప్రభుత్వ భవనాల్లో వంద శాతం మొక్కలు పెంచాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లోని రోడ్ల కిరువైపులా మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్ కు చర్యలు చేపట్టాలని డీపీఓ, డీఆర్డీఓకు సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలు సమన్వయంతో ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఏఐ పీడీ రాజేశ్, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): వలస కార్మికుల చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని, అమలు చేయని పరిశ్రమల యజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీసీఎల్ రవీందర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో వలస కార్మికుల చట్టాన్ని (1979) నిర్వీర్యం చేస్తున్నారన్నారు. వలస కార్మికులకు ఎటువంటి రక్షణ లేదన్నారు. ఈ చట్టాన్ని జిల్లాలో అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో సీఐటీయూ నాయకులు దత్తు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మాట్లాడుతూన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి దక్కిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నిర్మించిన 14 అదనపు తరగతులు, క్యాంటీన్ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాలకు కావల్సిన ఫర్నిచర్‌ను పరిశ్రమ అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్లాండ్ ఫార్మ పరిశ్రమ యాజమాన్యాన్ని కోరిన వెంటనే పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్ స్పందించి రూ.3.20 కోట్లతో ఆధునిక వసతులతో గదులు, ఫర్నిచర్, ఇద్దరు ఉపాధ్యాయులు, స్కావెంజర్, అటెండర్‌ను నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామన్నారు. సమాజ సేవకు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి రాథోడ్, సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమైక్య రాష్ట్రంలో దుర్భిక్షం..

- నేటి స్వపరిపాలనలో సుభిక్షం
- మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): సమైక్య పాలనలో తెలంగాణ దుర్భిక్షంగా ఉంటే, కేసీఆర్ పాలనీలో స్వరాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలానికి సంబంధించిన గిర్మాపూర్ కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నాటి సమైక్య పాలనలో తెలంగాణ రాష్ట్రం దుర్భిక్షంగా ఉండేదని, నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. నాటి కాంగ్రెస్, టీడీపీ పాలనలో రూ.200 పెన్షన్ నేడు రూ.2 వేలు ఇచ్చి దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, ఎంపీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ



భవిష్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: కామన్ యూనివర్శిటీ ప్రవేశ(సీయూఈటీ) పరీక్షలో మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల విద్యార్థి భవిష్‌రెడ్డి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ కెబెస్ జమీల్ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ న్యూఢిల్లీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో భవిష్‌రెడ్డికి 99.69 పర్సంటైల్ సాధించాడన్నారు. ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంక్ రావడంతో మైసూర్ సెంట్రల్ యూనివర్శిటీలో సీటు వచ్చిందన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అరబిందో ఫార్మా సేవలు అభినందనీయం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి



గోదామును ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి తోడు అరబిందో ఫార్మా రైతులకు సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెడ్డి ఖానాపూర్ గ్రామ శివారులో అరబిందో ఫార్మా రూ.2.40 కోట్లతో నిర్మించిన గోడౌన్, రైతు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, విత్తనాలు ఎరువులు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలుచేస్తోందన్నారు. అరబిందో పరిశ్రమ గోదాములు, శిక్షణ కేంద్రం నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్లు దామోదర్ రెడ్డి, దుర్గారెడ్డి, డీసీఓ ప్రసాద్, ఏడీ ఏ అరుణ, పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, రాధా మాధవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజేందర్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఎంపీటీసీలు విజయలక్ష్మి వెంకటేశం గుప్తా, వీరేశం విఠల్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా ఖేడ్ న్యాయవాది



జూకంటి అనిల్‌కుమార్

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన న్యాయవాది జూకంటి అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. రాష్ట్రానికి చెందిన న్యాయవాదుల విభాగం నుంచి ఈయనను ఎంపిక చేశారు. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ స్వగ్రామం. హైకోర్టులో 20 ఏళ్లుగా న్యాయవాదిగా కొనసాగుతున్నారు. అనిల్‌కుమార్ తండ్రి జూకంటి వీర్‌బసప్ప ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనరుగా 1996లో పదవీ విరమణ పొందారు.

చెరకు రైతులు అధైర్యపడొద్దు

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి మొత్తం ఇప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, రైతు సంఘం, బీఆర్ఎస్ నేత ఢిల్లీ వసంత్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ.12 కోట్లు బకాయి ఉండగా, ఇటీవల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో యాజమాన్యంతో సమావేశం అయ్యామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బకాయిలు ఇవ్వకున్నా ఇటీవల రూ.2.90 కోట్లు ఇచ్చిందన్నారు. మరో రూ.కోటి శనివారం విడుదల చేస్తున్నట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. బకాయిల విషయంలో రైతులు అధైర్యపడొద్దన్నారు.

క్లుప్తంగా

వీడిన మహిళ మృతదేహం మిస్టరీ


మునావత్ బాషా (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): గుర్తుతెలియని మహిళ మృతదేహం ఆచూకీ కనుగొన్నారు. శనివారం జిన్నారం సీఐ వేణు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న హత్నూర మండలం రొయ్య పల్లి శివారులో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభించిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు కొనసాగించగా వారం రోజులోనే పురోగతి సాధించారు. మృతురాలు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లమ్మ గూడెం తండాకు చెందిన మునావత్ బాషా(25)గా గుర్తించామని, ఆమెకు భర్త లక్ష్మణ్, పసికందు ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు. మృతురాలి చేతిపై ఉన్న లక్ష్మణ్ కిస్ మీ పచ్చ బొట్టు ఆధారంగా కేసు దర్యాప్తు నిర్వహించామన్నారు.త్వరలోనే పూర్తిస్థాయిలో కేసు ఛేదిస్తామని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణానికి వెళుతుండగా కుక్క దాడి

బాలుడికి గాయాలు


గాయపడిన సురేశ్

నర్సాపూర్: కిరాణా షాపునకు వెళుతుండగా బాలుడిపై శనివారం కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో అతడికి స్వల్పగాయమైంది. పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న తన ఇంటి నుంచి కిరాణా షాపునకు సురేశ్ అనే బాలుడు వెళుతుండగా ఉదయం 9 గంటల సమయంలో కుక్క దాడి చేసింది. ఈ దాడిలో అతను పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకొని కుక్కను తరిమి రక్షించారు. అప్పటికే అతడి చేతికి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ఇంజెక్షన్ వేశారు.

కంగ్టిలో 98.6 మిల్లీ మీటర్ల వర్షపాతం


కంగ్టిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాకివాగు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని నల్లవాగు తర్వాత అతిపెద్ద చెరువు దామర్‌గిద్దా కాకివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. ముర్కుంజాల్ సాములవాగు ప్రాజెక్టు అలుగు పారడానికి ఒక్క అడుగు తక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. మూడు రోజులు వరుసగా 42.4మిల్లీ మీటర్లు, 37.8 మిల్లీమీటర్లు శుక్రవారం రాత్రి 98.6 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఇసుకాసురుల భోజ్యం

- జనగామ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అక్కన్నపేట మండలంలో ఇదీ పరిస్థితి


జనగామ వాగులో ఇసుక తోడేసిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాగులు, వంకల నుంచి పగలూరాత్రీ అనే తేడా లేకుండా జరుగుతున్న అక్రమ దందాను అడ్డుకునే వారే కరువయ్యారు. ఇసుక అక్రమ రవాణాతో ఓ వైపు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.మరోవైపు సహజ వనరులు దెబ్బతింటున్నాయి.

- అక్కన్నపేట మండలం జనగామ వాగును అక్రమార్కులు తోడేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారు.
- ఈ వాగు నుంచి రోజు సుమారుగా 8 నుంచి 13 ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారంటే ఏ మేరకు రవాణా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.
- ఒక్కో ట్రాక్టర్ దూరాన్ని బట్టి రూ.3,800 నుంచి 4,500 వరకు విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

- ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- అప్పుడప్పుడు తనిఖీలు చేస్తూ ట్రాక్టర్లకు నామ మాత్రంగా జరిమానా విధించి వదిలేస్తున్నారు.
- దీంతో ఇసుక అక్రమ రవాణా చేసే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

- వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. గృహ నిర్మాణానికి ఇసుక అవసరం ఉంటే ఇంజినీరింగ్ శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం పొంది, తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.
- రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపి ఎంతమేరకు ఇసుక అవసరం ఉందో గుర్తించి అనుమతినిస్తారు.
- ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు స్థానిక వాగుల నుంచి ఇసుక తవ్వుకునేందుకు కూడా అనుమతులు ఉండాల్సిందే.
- కానీ నిబంధనలు గాలికి వదిలేసి ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.


వాగులో ట్రాక్టర్ల చక్రాల గుర్తులు

అనుమతులు ఇవ్వలేదు



జనగామ వాగులో ఇసుక తోడేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మండలంలో ఎవరికీ ఇసుక తరలింపు అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా ఎవరైనా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనులకు కూడా ఇసుక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంజీవ్‌కుమార్, తహసీల్దార్, అక్కన్నపేట

విద్యుదాఘాతానికి రైతు బలి


సంగయ్య మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతిచెందాడు. నిజాంపేట మండలం దామర్‌చెరువులో శనివారం ఈ ఘటన జరిగింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన శికరి సంగయ్య(38) స్వంత పొలం పనులకు వెళ్లాడు. బోరు మోటార్ వద్ద విద్యుత్ సరఫరా జరగడం లేదని దగ్గరలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై రైతు సంగయ్య అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రిమెంట్ చేయమంటే బెదిరిస్తున్నాడు..


బాధితుడు ఎండీ సాజిద్

బెజ్జంకి(సిద్దిపేట): ఒకేషనల్ కళాశాల నిర్వహణ కోసం భవనం అద్దెకిస్తానని మోసం చేసిన యజమానిపై కేసు నమోదైంది. ఈ ఘటన బెజ్జంకిలో శనివారం జరిగింది. బాధితుడు ఎండీ సాజిద్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన సాజిద్ బెజ్జంకిలో ఒకేషనల్(వృత్తివిద్య) కళాశాల పెట్టాలనుకున్నాడు. దాచారానికి చెందిన బుచ్చయ్యకు బెజ్జంకిలో గల భవనాన్ని మార్చిలో అద్దెకు తీసుకున్నాడు. రూ. 2 లక్షల డిపాజిట్‌తోపాటు నెలకు రూ. 38 వేల అద్దె ఒప్పందం చేసుకున్నాడు. డిపాజిట్ కింద రూ. 50 వేలు చెల్లించి, మిగితావి విడతలవారీగా ఇచ్చేలా మాట్లాడుకున్నారు. అనంతరం తన కళాశాల నిర్వహణ పనులు చేసుకొని ఫర్నిచర్ తెచ్చుకున్నాడు. అద్దెకు తీసుకున్న భవనానికి అగ్రిమెంట్ చేయకపోవడంతో తన కళాశాల అనుమతులు నిలిచిపోయాయి. అగ్రిమెంట్ చేయమంటే యజమాని బెదిరిస్తున్నాడని బాధితుడు ఎండీ సాజిద్ శనివారం బెజ్జంకి స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు 420 సెక్షన్ కింద కేసు నమోదు కాగా, ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసగాళ్ల బురిడీ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఫోన్ కాల్స్‌కు స్పందించి పలువురు బాధితులు శనివారం ఆన్‌లైన్ సైబర్ మోసానికి గురయ్యారు. సీపీ కథనం ప్రకారం..

- సిద్దిపేట త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగాలు ఉన్నాయని తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసి స్పందించి, ఆ నంబర్‌కు ఫోన్ చేశాడు. ఉద్యోగం కోసం ముందుగా ప్రాసిసెంగ్ చార్జీలు చెల్లించాలని తెలపగా బాధితుడు రూ.వెయ్యి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత ఖర్చుల కోసం డబ్బులు పంపాలని తెలపగా బాధితుడు, గుర్తు తెలియని వ్యక్తికి రూ.29,598 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించాడు.
- ఇదే తరహాలో గజ్వేల్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి, గుర్తు తెలియని మరో వ్యక్తికి రూ. 13వేలు పంపించి మోసపోయాడు.
- వన్ టౌన్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డు మంజూరు చేస్తామని, వ్యక్తిగత వివరాలతోపాటు గతంలో ఉన్న క్రెడిట్ కార్డు వివరాలు తెలపాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన వద్ద ఉన్న కార్డు వివరాలు తెలిపాడు. అతడి ఖాతా నుంచి రూ. 9,904 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.
- రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇన్‌స్ట్రాగామ్‌లో మూవీ యాక్టింగ్ అవకాశం ఉందనే యాడ్ చూసి అందులోని నంబర్‌కు ఫోన్ చేసింది. హీరోయిన్‌గా అవకాశం కల్పిస్తానని డబ్బులు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో రూ.16,000 పంపించింది. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది.
- పట్టణంలోని ఓ చికెన్ షాప్ నిర్వాహకుడికి జగదేవ్‌పూర్ పూర్ ఫామ్ హౌస్ నుంచి మాట్లాడుతున్నామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. 15 కేజీల చికెన్ ఆర్డర్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి చికెన్ షాప్ నిర్వాహకుడికి రూ.5 ఆన్‌లైన్‌లో పంపించాడు. మిగతా డబ్బులు పంపిస్తానని తాను పంపిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన చికెన్ షాప్ నిర్వాహకుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా తన ఖాతా నుంచి రూ.9,489 డెబిటైనట్లు మెసేజ్ వచ్చింది. జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఫొటో మార్ఫింగ్ చేసి యువతికి బెదిరింపులు

- పోలీసుల అదుపులో నిందితుడు
- రిమాండ్‌కు తరలింపు

దొండపర్తి: ఓ సామాజిక మాధ్యమంలో ఫొటో న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి యువతిని బ్లాక్‌మెయిల్ చేసిన యువకుడిని సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసుల కథనం ప్రకారం.. దొండపర్తిలోని హెచ్‌బీ కాలనీకి చెందిన యువతి ఫొటో న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి దానిని ఇంటర్నెట్‌లో పెడతానని ఆమెను ఓ వ్యక్తి బెదిరించాడు. అలాగే తన ఫ్యామిలీ మెంబర్స్ అందరి ఫొటోలు ఇదే మాదిరిగా మార్ఫింగ్ చేస్తానన్నాడు. దీంతో షాక్‌కు గురైన యువతి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సి.భవానిప్రసాద్ సాంకేతికతతో ఆ మార్ఫింగ్ ఫొటో పంపించింది తెలంగాణలోని సిద్దిపేటకు చెందిన మన్నే మధు(18)గా గుర్తించారు. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ ఆదేశాలతో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు సూచనలతో ఒక బృందాన్ని సిద్దిపేటకు పంపించారు. అక్కడ మధును చాకచక్యంగా పట్టుకొని విశాఖకు తీసుకువచ్చి అరెస్టు చూపించారు. శనివారం కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

సిద్దిపేటరూరల్: పాము కాటుకు గురై చికిత్సపొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రూరల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తోర్నాల గ్రామానికి చెందిన వాసూరి నారాయణ(55) ఈనెల 7న పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లిన నారాయణ ఇంటికి తిరిగొచ్చి తనకు పాము కాటు వేసిన విషయాన్ని కుటుంబీకులకు చెప్పి కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు నారాయణను హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్సపొందుతున్న నారాయణ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తీసుకోని రుణానికి వేధింపులు

పటాన్‌చెరు టౌన్: లోన్ తీసుకున్నావ్ తీర్చాలంటూ సైబర్ నేరస్తుడు వేధింపులకు గురిచేసిన ఘటన పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఈనెల 4న తన ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అది చూసి సత్యనారాయణ కాల్ చేసి మాట్లాడగా, నీవు రుణం తీసుకున్నావు వెంటనే నగదు చెల్లించాలని సైబర్ మోసగాడు చెప్పాడు. వెంటనే చార్జీలు కింద రూ.200 జమ చేయాలని చెప్పడంతో కంగారుపడిన సత్యనారాయణ జమ చేశాడు. అనంతరం ఎక్కడా తాను రుణం తీసుకోలేదని ధ్రువీకరించుకున్నాక, తర్వాత అవతల నుంచి ఫోన్ చేసినా సత్యనారాయణ స్పందించలేదు. దీంతో బాధితుడి తల్లి, చెల్లిని ప్రస్తావిస్తూ అసభ్యకర మెసేజ్‌లు పెడతామని శనివారం ఉదయం నుంచి సైబర్ మోసగాడు వేధించాడు. హుటాహుటిన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్ మందాని

నారాయణఖేడ్: చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని నారాయణఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంధాని అన్నారు. నారాయణఖేడ్ కోర్టు ఆవరణలో శనివారం మండల లీగల్‌సెల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పౌరులకు చట్టాలపై సమగ్ర అవగాహన ఉంటే శిక్షపడుతుందనే భయంతో నేరాలు తగ్గుతాయన్నారు. ఉచిత న్యాయ సహాయ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. న్యాయవాదులు భోజిరెడ్డి, సుధాకర్, లీగల్ సర్వీస్ సంస్థ సభ్యులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): నేటి సమాజంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని జోగిపేట మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ధనలక్ష్మి అన్నారు. శనివారం జోగిపేటలోని బాలికల వసతి గృహంలో విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించకపోవటంతో..


జేసీబీతో ఇళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

- ఇళ్లు కూల్చివేసిన అధికారులు
- ఆందోళన చేపట్టిన బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): 59 జీఓ కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నా, డబ్బులు చెల్లించకపోవటంతో రెవెన్యూ అధికారులు ఇళ్ల కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. శనివారం తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది డబ్బులు చెల్లించని వారి ఇళ్లను కూల్చివేయించేలా చర్యలు చేపట్టారు. పోలీసుల సమక్షంలో జేసీబీతో ఇళ్లను కూల్చివేయించారు. బీజేపీ నాయకుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం సరైంది కాదని ఆందోళన చేపట్టారు. నిరుపేద వ్యక్తి క్రమద్ధీకరణకు లక్షల్లో డబ్బులు చెల్లించటం ఏమిటని నాయకులు అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుపేదలకు అండగా ఉంటామని, మరోసారి ఇళ్లను కూల్చివేసే చర్యలకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ బొల్లారంలో 51 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు డబ్బులు చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నీట మునిగి విద్యార్థి..


అబ్దుల్ హసీబ్(ఫైల్)

ములుగు(గజ్వేల్) : కొండ పోచమ్మ సాగర్‌లో ప్రమాదవశాత్తు మునిగి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం ములుగు మండలం కొండపోచమ్మ సాగర్ వద్ద చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అంజయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని న్యూ ఆఫీస్ పెట్ మియాపూర్ శేరిలింగంపల్లి ఆదిత్యానగర్ కాలనీకి చెందిన ఎండీ అబ్దుల్ హసీబ్(20) డిగ్రీ చదువుతుండేవాడు. శుక్రవారం సాయంత్రం మిత్రులతో కలిసి సాగర్ చూసేందుకొచ్చాడు. డ్యాంలో దిగి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. పోలీసులు శనివారం ఉదయం గాలించి అబ్దుల్ హసీబ్ మృతదేహాన్ని సాగర్‌లోంచి స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తండ్రి అలీ కామిల్ పాషా ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో ఇద్దరికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): భూతగాదాలో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం మండలంలోని రాంసాగర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నంబర్ 72లోని భూమి విషయంలో కొంతమంది మధ్య వివాదం కొనసాగుతోంది. శనివారం పాకనాటి సుధాకర్, పరుశురాములు భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా పాకనాటి బాల్‌నర్సయ్య, పాకనాటి భాస్కర్ అడ్డుకున్నారు. దీంతో పాకనాటి సుధాకర్, పరుశురాములు గడ్డపారతో దాడిచేయగా బాల్‌నర్సయ్య కు, భాస్కర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడ్డ క్షతగాత్రులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తూప్రాన్-నర్సాపూర్ హైవే దొంతి గ్రామశివారులో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బేగంపేటకు చెందిన వ్యక్తులు సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి కారులో వెళ్తున్నారు. అలాగే కొమురవెల్లి మల్లన్నస్వామి దర్శనం చేసుకొని నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్, ప్రవీణ్ బైక్‌పై తిరుగుపయనం అవుతున్నారు. ఈ క్రమంలో దొంతి శివారులో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ప్రశాంత్, ప్రవీణ్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను వెనుక నుంచి ఢీకొని..
ఒకరికి తీవ్రగాయాలు

నర్సాపూర్‌రూరల్: లారీ, బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టగా వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నర్సాపూర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. నర్సాపూర్ మండలం మదాపూర్‌కు చెందిన మహ్మద్ వహీద్ నర్సాపూర్ పట్టణానికి పనులపై వెళ్లి తిరుగు పయనమవుతుండగా, వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వహిద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురి బలవన్మరణాలు

వేర్వేరు చోట్ల ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుకునూరుపల్లి, పాపన్నపేట, తెల్లాపూర్, సిద్దిపేట అర్బన్, జహీరాబాద్ పట్టణంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


మహిపాల్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వార్డు సభ్యుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఈ సంఘటన మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుకునూరుపల్లికి చెందిన 8వ వార్డు సభ్యుడు కొంతం మహిపాల్(32), కుటుంబ పోషణ కోసం ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ సొంతంగా ఉన్న ట్రాక్టరు నడుపుతుండేవాడు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం తెలిసిన వారి వద్ద రూ.8లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చడం కోసం ట్రాక్టర్ విక్రయించినా తీరకపోవడంతో లోలోన మదన పడుతుండేవాడు. శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి వేర్వేరు గదుల్లో నిద్రించారు. శనివారం ఉదయం గది నుంచి బయటకు రాకపోవడంతో భార్య లావణ్య తలుపు తట్టగా తీయకపోవడంతో పక్కింటి యజమాని కొంతం బాల్‌లింగం తలుపులు పగలగొట్టి చూస్తే ఉరేసుకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, ఉపసర్పంచ్ బాలాగౌడ్‌తో పాటు మిగతా వార్డు సభ్యులు మృతదేహం వద్ద సంతాపం తెలిపారు.

పని వెతుక్కోమన్నందుకు ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేక్మాల్ మండలం బోడగట్టులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బోడగట్టు గ్రామానికి చెందిన సురేశ్(27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని రోజులుగా సురేశ్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఏదైనా పని చేయమని పలుమార్లు అతడి భార్య భాగ్యలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సురేశ్ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు రాత్రి అతడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. గ్రామ శివారులోని కొచ్చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం మృతదేహం చూసిన కొందరు ఈ విషయమై గ్రామస్తులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో మరొకరు..

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూర్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన బిశ్వ రంజన్(40) జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. స్థానికంగా ఓ బహుళ అంతస్తుల భవనం నిర్మాణంలో కూలీగా పనిచేసుకునేవాడు. తోటి కూలీలతో కలిసి లేబర్‌క్యాంప్‌లో ఉండేవాడు. కాగా శుక్రవారం తోటి కూలీలు పనికి రమ్మని బిశ్వ రంజన్ పిలిచారు. తను పనికిరానని వారికి చెప్పడంతో వెళ్లిపోయారు. తిరిగి రాత్రికి వచ్చి చూసేసరికి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పోలీసులకు, ఒడిశాలోని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పితో ఇంకొకరు..

సిద్దిపేటఅర్బన్: కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లోని ఒడిసెలకుంట వద్ద చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీ అరుంధతి నగర్‌వాసి బండపల్లి శివకుమార్(28) ఓ కూలీ. అతడు రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు.చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందుతున్నాడు.శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభించలేదు.కిష్ట సాగర్ సమీపంలోని ఒడిసెలకుంట చెరువు వద్ద గుర్తుతెలియని వ్యక్తి చనిపోయినట్టు మృతుడి తండ్రి తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లి చూడగా కుమారుడు చెరువులో విగత జీవిగా కనిపించాడు. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

జహీరాబాద్ టౌన్: కుటుంబ కలహాల కారణంగా శనివారం రాత్రి పట్టణంలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కామేశ్(25) కుటుంబకలహాలతో మనస్తాపంచెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.